


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అనంతపురం | సంచిక : 280 | ఆదివారం 19 ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### మహిళా రిజర్వేషన్ చట్టాన్ని

## అమలు చేయండి



**న్యూఢిల్లీ, సూర్యవాస్తవం:** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఆమోదించిన 2023 చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఇండియా బ్లాక్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రికి లేఖ రాయనున్నట్టు తెలిపారు. ఇండియా బ్లాక్ నేతలు శనివారం పార్లమెంట్‌లో సమావేశమయ్యారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన 'నారీ శక్తి వందన్ అధినయం'గా పిలుస్తున్న 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 ఈ నెల 16న గురువారం నుంచే అమల్లోకి వచ్చినట్టుగా కేంద్ర న్యాయశాఖ గెజిట్ విడుదల చేసిందని, ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న స్థానాల్లోనే మహిళలకు రిజర్వేషన్ అమల్జేయవచ్చునని ప్రతిపక్షాల నేతలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమంటూ ప్రభుత్వం, బిజెపి తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. మహిళల బిల్లు ముసుగులో కుట్రపూరితంగా డీలిమిటేషన్ బిల్లుతో దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని, అందుకనే ఆ కుట్రను తాము వ్యతిరేకించామని తెలిపారు. ఇదే విషయాన్ని ప్రజల ముందుకు తీసుకు వెళ్లేందుకు దేశవ్యాప్తంగా మీడియా సమావేశాలు నిర్వహించనున్నట్టు 'ఇండియా' బ్లాక్ నేతలు తెలిపారు. పార్లమెంటులో సీట్ల పెంపుతో సంబంధం లేకుండా తక్షణమే పాత మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని కోరుతున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వ్యవహారంలో కేంద్ర వైఖరిని తప్పుబడుతున్నారు. సీట్ల పెంపుతో రాజకీయ సమతుల్యత దెబ్బతింటుందని, రిజర్వేషన్ పాలసీ ఉద్దేశమే మారిపోతుందని విమర్శించారు.

### శాశ్వతంగా అధికారంలో ఉండేందుకే

## డీలిమిటేషన్ కుట్ర

- 2023 మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయండి
- ఇతర అంశాలతో ముడి పెట్టొద్దు
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, సూర్యవాస్తవం:** డీలిమిటేషన్ వెనుక బిజెపి కుట్ర దాగుందని, శాశ్వతంగా అధికారంలో ఉండేందుకే ఆ పార్టీ నేతలు ఈ రకమైన కుట్రలు పనున్నతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. అయితే.. విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత జైరాం రమేష్‌తో కలిసి ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం వెనుక వ్యూహాత్మక రాజకీయ కుట్ర ఉందని అన్నారు. బిజెపి శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు ఈ బిల్లును వాడుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను అడ్డుకునే ప్రయత్నం చేసిందని విమర్శించారు. ప్రతి పక్షాల ఐక్యతతో ఇది వీగిపోవడంతో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. 'ఎన్డీఎ హయాంలో జరిగిన ఆకృత్యాలను ప్రజలు చూశారు. హత్రాస్ లో మహిళలకు, మన ఒలింపిక్ పతాక విజేతలకు ఏం జరిగిందో మనం చూశాం. 2023 నాటి బిల్లును మళ్లీ తీసుకొచ్చి సభలో పెట్టండి. ఎవరు మహిళా వ్యతిరేకి అనే విషయం అప్పుడు తెలుస్తుంది. ఇతర అంశాలతో మహిళా బిల్లును ముడి పెట్టి మోసం చేయవద్దు' అని ప్రియాంక చెప్పారు. ప్రజాస్వామ్యం, మహిళా హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని ఆమె కోరారు. దేశ రాజ్యాంగాన్ని సంరక్షించుకున్నందుకే తాము సంబరాలు చేసుకున్నామని చెప్పారు. మహిళలను సాకుగా చూపి ఇష్టారీతిన నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని బిజెపి కుట్ర చేసిందని, ఆ కుట్రను తాము తిప్పికొట్టామని అన్నారు. ప్రతిపక్షాలన్నీ పాత మహిళా రిజర్వేషన్ బిల్లునే తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, తాము ఎల్లప్పుడూ మహిళలకు అండగా ఉంటామని ఆమె చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో లింకుపెట్టి మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడాన్ని తాము సమర్థించలేదని చెప్పారు.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### ముగిసిన పార్లమెంట్

# బడ్జెట్ సమావేశాలు

## ఉభయ సభల్లో తొమ్మిది బిల్లులు ఆమోదం



**న్యూఢిల్లీ, సూర్యవాస్తవం:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. ఉభయ సభల్లో మొత్తం 9 బిల్లులు ఆమోదం పొందాయి. మూడవ వంతు మెజారిటీ రాకపోవడంతో కీలకమైన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. లోక్‌సభ 93 శాతం, రాజ్యసభ 110 శాతం కార్యకలాపాలు జరిగాయి. శనివారం ఉదయం 11 గంటలకు లోక్ సభ ప్రారంభం కాగానే, స్పీకర్ ఓం బిర్లా సమావేశ వివరాలను వెల్లడించారు. లోక్‌సభ 93 శాతం జరిగిందని తెలిపారు. ఆ తరువాత ఆయన సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ సిపి రాధాకృష్ణన్ తెలిపారు. రాజ్యసభ సుమారు 157 గంటల 40 నిమిషాల పాటు సాగినట్లు చెప్పారు. సుమారు 110 శాతం జరిగిందని తెలిపారు. జనవరి 28న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు మూడు విడతల్లో 31 రోజుల పాటు సభ కార్యకలాపాలు జరిగాయి. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు మొదట విడత సమావేశాలు జరిగాయి. మార్చి 9న ప్రారంభమైన రెండో విడత సమావేశాలు ఏప్రిల్ 2 వరకు జరిగి వాయిదా పడ్డాయి. మూడో విడత సమావేశాలు ఏప్రిల్ 16న ప్రారంభమై మూడు రోజులపాటు పాటు జరిగి శనివారం ముగిశాయి. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో మొదట విడత ప్రారంభమై, ఫిబ్రవరి 1న 2026-27 బడ్జెట్ ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఉభయ సభల్లో 87 మంది సభ్యులు పాల్గొన్నారు. బడ్జెట్ పై జరిగిన చర్చలో ఉభయ సభల్లో 160 మంది సభ్యులు పాల్గొన్నారు. ప్రతిపక్షం పట్ల పక్షపాతంగా వ్యవహరించిన స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలనే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ చర్చలో 53 మంది సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేగ్వాల్ తో కలిసి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడారు. లోక్ సభలో 12 బిల్లులు ప్రవేశపెట్టగా, రాజ్యసభలో ఒక బిల్లు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఉభయ సభల్లో మొత్తం తొమ్మిది బిల్లులు ఆమోదం పొందాయని తెలిపారు. లోక్ సభలో సెలెక్ట్ కమిటీ నివేదించిన ప్రకారం జన్ విశ్వాస్ బిల్లును ఉపసంహరించుకున్నట్లు చెప్పారు.

**ఉభయ సభలు ఆమోదించిన బిల్లులు ఇవే**

1. పారిశ్రామిక సంబంధాల కోడ్ (సవరణ) బిల్లు, 2. అప్రొపియేషన్ బిల్లు, 3. ట్రాన్స్ జెండర్ (హక్కుల పరిరక్షణ) సవరణ బిల్లు, 4. అప్రొపియేషన్ (నెం.2) బిల్లు 5. ఫైనాన్స్ బిల్లు, 6. దివాలా అండ్ బ్యాంక్రప్సీ కోడ్ సవరణ బిల్లు, 7. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు, 8. జన్ విశ్వాస్ నిబంధనల సవరణ బిల్లు, 9. కేంద్ర సాయుధ పోలీసు బలగాల సాధారణ పరిపాలన బిల్లు.

### పీఎంజీఎస్‌వై మూడో దశ

## కొనసాగింపునకు ఆమోదం

- రూ. 83, 977 కోట్ల కేటాయింపులు
- సముద్రయాన బీమా కవరేజీకి రూ.12,980 కోట్లు
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు



**న్యూఢిల్లీ, సూర్యవాస్తవం:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన శనివారం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన మూడోదశ 2028 వరకు కొనసాగింపునకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కోసం రూ. 83,977 కోట్ల కేటాయింపులు జరుగుతాయి. భారత్ మ్యారీ టైం ఇన్సూరెన్స్ పూల్ ఏర్పాటు ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. నిరంతర సముద్రయాన బీమా కవరేజీ కోసం రూ.12,980 కోట్లు కేటాయించారు. ప్రపంచ అస్థిరత భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నౌకల బీమా కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. యుద్ధ ప్రమాద నష్టాలను కవర్ చేసేలా బీమా ఉంటుంది. రాజమండ్రి (నిడదవోలు)-(దువ్వాడ) మధ్య 3, 4వ రైల్వే లైన్ ట్రాక్ ఏర్పాటుకూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 198 కిలోమీటర్ల రూట్‌లో, 458 కిలో మీటర్ల ట్రాక్ ఏర్పాటు కానుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.9,889 కోట్లు ఖర్చు చేయనుంది.

**మరిన్ని కీలక నిర్ణయాలు**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల అదనపు డీఏ నిధుల విడుదలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అదనంగా పెరిగిన ఈ రెండు శాతం డీఏ ఈ ఏడాది జనవరి నుంచి అమలు కానుంది. ఈ పెంపుతో ప్రభుత్వ ఖజానాపై రూ. 6,791 కోట్ల అదనపు భారం పడనుంది. 50.46 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 68.27 శాతం పెన్షన్ దారులకు ప్రయోజనం చేకూరుతుంది. అదే విధంగా ఘజియాబాద్, సీతాపూర్ థర్డ్, ఫోర్త్ రైల్ లైన్ విస్తరణకు రూ. 14,926 కోట్లు కేటాయింపు.

### ఉక్రెయిన్ రాజధానిలో

## మరోసారి రక్తపాతం



**హైదరాబాద్, సూర్యవాస్తవం:** యుద్ధ వాతావరణం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో మరోసారి రక్తపాతం జరిగింది. శనివారం జరిగిన కాల్పుల ఘటనలో ఆరుగురు మరణించగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. నగరంలోని హోలోసీవ్స్కి జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. 58 ఏళ్ల నిందితుడు తొలుత తన అపార్ట్‌మెంట్‌కు నిప్పంటించాడు. ఆ తర్వాత ఆటోమేటిక్ తుపాకీతో వీధుల్లోకి వచ్చి కనిపించిన వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ దాడిలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనంతరం నిందితుడు సమీపంలోని ఓ సూపర్ మార్కెట్‌లోకి ప్రవేశించి, అక్కడున్న వారిని బందీలుగా చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడితో దాదాపు 40 నిమిషాల పాటు చర్చలు జరిపారు. అయితే, చర్చలు విఫలం కావడంతో పాటు లోపల బందీగా ఉన్న ఒకరిని అతను కాల్చి చంపడంతో స్పెషల్ ఫోర్స్ పోలీసులు లోపలికి ప్రవేశించి నిందితుడిని హతమార్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో మహిళ మృతి చెందడంతో మొత్తం మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఈ ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. నిందితుడు రష్యాలోని మాస్కోలో జన్మించాడని, గతంలో నేర చరిత్ర ఉందని తెలిపారు. ఆశ్చర్యకరంగా, అతని వద్ద తుపాకీకి లైసెన్స్ కూడా ఉందని వెల్లడించారు. వారిలో ఒక చిన్నారి కూడా ఉందని మేయర్ విటాలీ క్లిట్ష్కో తెలిపారు. ఉక్రెయిన్ భద్రతా సంస్థ దాడిని ఉగ్రవాద చర్యగా నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

# మూగ నోముకు మధుర స్వరం

- శ్రవణంతో చిన్నారుల భవిష్యత్తుకు వెలుగులు నింపుతున్న టిటిడి
- శ్రవణంను పరిశీలించిన టిటిడి జేఈవో డా. ఎ. శరత్
- టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర శ్రవణం సంస్థను టిటిడి జేఈవో (వైద్యం మరియు విద్య)



**తిరుపతి సూర్యవాస్తవం, ఏప్రిల్ 18:** డా. ఎ. శరత్ శనివారం అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. చిన్నారుల జీవితాల్లో శ్రవణం ద్వారా వస్తున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకొని, సేవల మరింత మెరుగుదలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర శ్రవణం, శ్రీ వేంకటేశ్వర బాలమందిరం సంస్థలలో అందిస్తున్న సేవలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని జేఈవో సూచించారు. టిటిడి సమాచార కేంద్రాలు, కల్యాణ మండపాలు, ఎస్వీబీసీ ఛానల్, టిటిడి సోషల్ మీడియా, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ మరియు దివ్యాంగుల శాఖలతో సమన్వయం చేసుకుని ప్రచారాన్ని విస్తరించాలని ఆదేశించారు. 2026--2027 విద్యాసంవత్సర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సెలవులు ముగిసేలోపు పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరారు. పిల్లల తల్లులతో మమేకమై మాట్లాడిన జేఈవో, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆహారం అందుతున్నదా, శిక్షణ నాణ్యత ఎలా ఉందో, పిల్లలలో వచ్చిన పురోగతి, సౌకర్యాలపై సంతృప్తి స్థాయి వంటి అంశాలను తెలుసుకున్నారు. పలు ప్రాంతాల నుండి వచ్చిన తల్లులు శిక్షణపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ, "మూగ నోముతో వచ్చాం... నవ్వు నోముతో వెళ్తున్నాం" అని భావోద్వేగంగా తెలిపారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో ఆధునిక వసతులు, డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయాలని జేఈవో సూచించారు. డే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం, శిక్షణ అనంతరం ఆధునిక వినికిడి పరికరాల పంపిణీ, మెరుగైన బోధనాంశాలు, బోధనా పద్ధతులు, స్టేషనరీ, స్టడీ మెటీరియల్, పాఠ్యాంశాలపై డిఈవో టి. వెంకట సునీల్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్వో డి. ఫణికుమార్ నాయుడు, డిఈవో టి. వెంకట సునీల్, అదనపు ఆరోగ్య అధికారి డా. సునీల్, శ్రవణం ప్రాజెక్ట్ ఏఈవో అమ్ములు, ఈఈ మల్లికార్జున ప్రసాద్, ఇతర అధికారులు, శ్రవణం సిబ్బంది పాల్గొన్నారు.



## చెవిరెడ్డి కుటుంబం అభివృద్ధికి కట్టుబాటు

**చిన్నగొట్టిగల్లు, సూర్యవాస్తవం:** చంద్రగిరి నియోజకవర్గంలో ఆక్రమణలు, అక్రమ కేసులు నమోదు చేయడం తెలుగుదేశం పార్టీ నైజమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తీవ్రంగా విమర్శించారు. శనివారం చిన్నగొట్టిగల్లులోని వైసీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెవిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే స్థాయి, అర్హత ఎమ్మెల్యే పులివర్తి నానికి లేదని అన్నారు. చెవిరెడ్డి కుటుంబం ఎప్పుడూ సంస్కారవంతమైన, స్నేహపూర్వక రాజకీయాలకే కట్టుబడి ఉందని, దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు వంటి అసాంఘిక చర్యలకు దూరంగా ఉంటుందని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కలిసి సుమారు రూ.82 కోట్లతో చిన్నగొట్టిగల్లు మండలాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు సహాయం చేసిన ఘనత చెవిరెడ్డి కుటుంబానిదేనని పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన మోహిత్ రెడ్డిపై ఎమ్మెల్యే నాని అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. ఇసుక, మట్టి, గ్రానైట్, మైనింగ్ వంటి సహజ వనరుల దోపిడీ తమకు తెలియదని, అభివృద్ధి పనులే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. గ్రామాల్లో జగనన్న సమావేశ మండపాలు, రచ్చబండలు, సీసీ డ్రైన్లు, కర్మక్రియ భవనాలు, సిమెంట్ మరియు గ్రావెల్ రోడ్లు నిర్మించడం, ప్రతి గ్రామంలో బెంచీలు ఏర్పాటు చేయడం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అలాగే గ్రామాల్లో రాజకీయ ఘర్షణలు లేకుండా శాంతి వాతావరణం నెలకొల్పడమే తమ లక్ష్యమని అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపేందుకు సిద్ధమని, ప్రస్తుతం రెండు సంవత్సరాల టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చూపించగలరా అంటూ సవాల్ విసిరారు. ఎమ్మెల్యే పులివర్తి నాని పై మీడియా సమావేశాల్లో మాట్లాడిన వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. తమ నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాటలకు కట్టుబడి ఉన్నామని అన్నారు. తమరు చేసే అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మరని ఎద్దేవా చేశారు.

## భోగసముద్రం చెరువు

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

### బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత



**పెనుకొండ, సూర్యవాస్తవం :** శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో "జలం--జీవం" అనే ప్రధాన నినాదంతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం భాగంగా పెనుకొండ మండలంలోని భోగసముద్రం చెరువులో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత స్వయంగా పాల్గొని చెరువులోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, "జలం ఉంటేనే జీవం ఉంటుంది" అనే భావనను ప్రజల్లో నాటేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. చెరువులు, కాలువలు శుభ్రంగా ఉంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని ఆమె పేర్కొన్నారు. అనంతరం అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు, యువత పాల్గొని శుభ్రతకు తమ మద్దతు తెలిపారు..



## కంప్యూటర్ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



**చంద్రగిరి , సూర్యవాస్తవం:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కంప్యూటర్ విద్య ఆధారం కానున్నదని బైరెడ్డి భాను ప్రకాష్ చెప్పారు. మండలంలోని,దోర్నకంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. కంప్యూటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యం వినోద్ కుమార్ అనే విద్యార్థికి ధాత బైరెడ్డి భాను ప్రకాష్ సొంత నిధులతో పర్సనల్ కంప్యూటర్ ను అందించారు. అదేవిధంగా అబాకస్ నందు ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాల అధినేత హితేంద్రనాథ్ రెడ్డి సర్టిఫికెట్లు, పతకాలను ప్రధానం చేయడమైనది. పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న బైరెడ్డి భానుప్రకాష్ మరియు బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాల కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి ని పాఠశాల తరఫున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లలిత కుమారి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారులు లలిత కుమారీ మేడం, భాస్కర్ బాబు గారు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు ధర్మినేని జగదీష్ ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీధర్ బాబు, రమేష్, శ్రీనివాసులు, రాజేంద్ర, జ్యోతి మరియు పాఠశాల విద్య కమిటీ చైర్మన్ హైమావతి, గ్రామ పెద్దలు లోకేష్ రెడ్డి, ముని కృష్ణారెడ్డి మునిరాజా పాల్గొనడం జరిగింది.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## తులసి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా అగ్నిమాపక అధికారి

**వేంపల్లె - సూర్య వాస్తవం:** అజాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు అయిన శనివారం కడప జిల్లా అగ్నిమాపక అధికారి శరత్ బాబు వేంపల్లికు వచ్చారు. ఈ సందర్భంగా శరత్ బాబు వేంపల్లె అగ్నిమాపక అధికారి శివరాంరెడ్డి, వారి సిబ్బందితో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. కడప జిల్లాలో కడప,ప్రొద్దుటూరు, బద్వేలు, పోరుమామిళ్ల,మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, వేంపల్లి,కమలాపురం కేంద్రాలలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయని, రాజంపేట అగ్ని మాపక కేంద్రం కూడా తమ పరిధిలోకి వస్తుందని, త్వరలో ముద్దనూరులో నూతన అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభిస్తామని శరత్ బాబు తులసి రెడ్డికి వివరించారు.గతంలో గుడిసెలు,వాములు అగ్నికి ఆహుతి కావడం ఎక్కువగా ఉండేదని ఇటీవల కాలంలో అవి తగ్గిపోయాయని, అరటి,మామిడి తదితర తోటలు అగ్నికి ఆహుతి కావడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడం,, నీటిలో మునిగిపోవడం ఇటువంటి సంఘటనలు ఎక్కువయ్యాయని శరత్ బాబు అన్నారు. జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, ప్రత్యేకించి వేంపల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి శివరాం రెడ్డి, వారి సిబ్బంది సమర్థవంతంగా తమ బాధ్యతలను నిర్వహిస్తున్నారని,మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. అగ్నిమాపక కేంద్ర శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారం కోసం తన శాయశక్తుల సహాయం అందిస్తానని తులసి రెడ్డి వారితో అన్నారు.అగ్ని అదుపులో ఉంటే వరం,అదుపు తప్పితే శాపం అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.


## గుత్తి లో జలధార జల హారతి కార్యక్రమం

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశా ల మేరకు గుత్తి మున్సిపల్ కమీష నర్ బి.జబ్బార్ మియా ఆధ్వర్యం లో జలధార జల హారతి కార్యక్రమం లో భాగంగా గుత్తి పట్టణం యందు స్థానిక గాంధీ సర్కిల్ కూడలి నుండి రాజీవ్ సర్కిల్ వరకు నీటి వినియో గం,నీటి వనరులు సంరక్షణ,ఎండ కాలపు తీవ్రత పై తీసుకోవలసిన జా గ్రత్తలు,తడిచెత్త,పొడిచెత్త,ప్రమాద పు చెత్త వేరుచుట,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధము పై పెద్ద ఎత్తున అ వగాహన ర్యాలీ జరిగినది.ఈ కార్య క్రమంలో డి.ఈ.ఈ హేమచంద్ర కు మార్, మేనేజర్ రాంబాబు,శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ భాషా, ఏ. ఈ గోవిందప్ప,మెప్మా టి.ఎం. సి చం ద్ర శేఖర్, మున్సిపల్ అధికారులు,సి బ్బంది,సచివాలయ సిబ్బంది,కళాకా రులు నాగేశ్వర రావు,మున్సిపల్ వ ర్కర్స్ మరియు మెప్మా ఆర్.పి లు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొ న్నారు.

### పామిడి లో ఈ నెల 24నుండీ 29వరకు

## రుక్మిణి పాండురంగస్వామి ప్రతిష్ఠ

**పామిడి -సూర్య వాస్తవం:** పట్టణం లోని భావసారా క్షత్రియ సమాజ్ డబ్బిదార్ ఫిర్కా



రుక్మిణి సమేత పాండురంగస్వామి స్వామి నూతన ఆలయం లో స్వామి వారి పునఃప్రతిష్ఠ, మహా కుంభ సంప్రో క్షణ, హింగూలికంబికా ప్రతిష్ఠ అఖండ సామూహిక జ్ఞానేశ్వరి పారాయణ సప్తాహం ఈ నెల 24వతేది శుక్రవారం నుండీ 29వతేది బుధవారం వరకు పండరిపురం తుకారాం గురుపరంపర గోపాల్ వాస్కార్ వారిచే పండరిపుర సంప్రదాయం తోనిర్వహిస్తారు. అయన బృందం చే నిత్యం మరాఠీ అభంగ భజనలు, జ్ఞానేశ్వరి గ్రంథ పారాయణం, ప్రవచనాలు, కాకడ హారతి, నామజపాలు, ఊరేగింపు ఒక రోజు, కీర్తనలు కొనసాగుతయు. అలాగే తిరుపతి వేద పండితుల బృందం కాండూరి ఆర్య బృందం చే వేదసంప్రదాయం ప్రకారం హోమాలు, ఆరాధనలు, కళశాలస్థాపన, ఆదివాసాలు, ప్రతిష్ఠ తంతు స్నపనము, శాత్తు మర, వేద విన్నపాలు, తీర్థ గోష్టి,ఇతర కార్యమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలిపారుప్రతిరోజు కార్యక్రమం లో పాల్గొన్న వారికి అన్నప్రసాద వినియోగం చేస్తామని తెలిపారు.

## లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర విశేష పూజలు



**సింహాద్రిపురం సూర్య వాస్తవం:** సింహాద్రిపురం ఏడు బిళ్ళల బాయి సమీ సమీపం శ్రీ ప్రసన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయం లో శనివారం స్వాతి నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులచేతొలుత స్వామివారికి పంచామృత అభిషేక ప్రత్యేక పూజలు నిర్వ హించారు వేద పండితులు సుబ్రమణ్య శర్మ,సాయికృష్ణ శర్మ, నాగరాజు శర్మ, సాయి హర్ష వర్ధన్ శర్మ, పవన్ కుమార్ ల ఆధ్వర్యం లో గణపతి పూజ పుణ్యహవచ్నం, కలశ పూజ శ్రీ లక్ష్మీనరసింహ కలదపూజ మహా సప్న కలశ పూజ, గణపతి హోమం, పూర్ణాహుతితో పరి సమాప్తం అయింది. ఈహోమం కార్యక్రమం లో వీర రాఘవరెడ్డి దంపతులు, పరమేశ్వర రెడ్డిదంపతులు, ఓబులరెడ్డి దంపతులు, సుబ్బారెడ్డి దంతులు,ఆలయ కమిటీ ప్రసిడెంట్వేణుగోపాలరెడ్డి, ఆలయ ధర్మ కర్త సూర్యనారాయణరెడ్డి,సభ్యులు పురుషోత్తమరెడ్డి, జయరామిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, రాజకళ అర్చకులు కామాక్షి మరియు సోమశేఖర్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసారు.

## మహిళా రిజర్వేషన్లపై బిజెపికి చిత్తశుద్ధి లేదు

**వేంపల్లె - సూర్య వాస్తవం:** చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంపై బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శనివారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల, బాండ శుద్ధి లేని పాకమేల, చిత్తశుద్ధి లేని శివ పూజ లేలయా,విశ్వదాభిరామ వినురవేమ అన్న వేమన పద్యం బిజెపిని చూస్తే గుర్తుకొస్తోందని తులసి రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్ల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే డీ లిమిటేషన్ బిల్లుతో కలపకుండా మహిళా బిల్లును విడిగా పెట్టి ఉండేదన్నారు.డిలిమిటేషన్ బిల్లుతో కలిపి పెట్టడం వల్లనే మహిళా బిల్లుకు పార్లమెంటులో ఆమోదం లభించలేదు.నిజంగా బిజెపికి మహిళా రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ ఒక్క బిల్లును విడిగా పెడితే ఈ రోజే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి మహిళా సాధికారతకు ప్రాముఖ్యత ఇస్తోంది. సరోజినీ నాయుడు,అనీ బిసెంట్, ఇందిరాగాంధీ,సోనియాగాంధీ లాంటి మహిళలు భారత జాతీయ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు అయ్యారు. కాంగ్రెస్ పార్టీ తరఫున శ్రీమతి ప్రతిభాపాటిల్ భారత రాష్ట్రపతిగా, ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా, శ్రీమతి మీరా కుమార్ లోక్సభ స్పీకర్ అయ్యారు అన్నారు.కాంగ్రెస్ తరపున అనేకమంది మహిళలు గవర్నర్లుగా, ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా, రాష్ట్ర మంత్రులుగా వివిధ ప్రభుత్వ హోదాలలో సేవలు



అందించి సమర్థవంతంగా పనిచేశారన్నారు. 1993 లోనే 33 సంవత్సరాల క్రితమే స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు,జిల్లా పరిషత్తులు,పురపాలక సంఘాలు,కార్పొరేషన్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. నాణానికి బొమ్మ బొరుసు లాగా బిజెపికి రాష్ట్రంలో చంద్రబాబు జగన్ రెండు రెండు ముఖాల వంటి వారున్నారు. చంద్రబాబుది జగన్ ది విచిత్రబంధం అని ఎద్దేవా చేశారు.ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ ఇది వారి ఆట అన్నారు.టిడిపి వైకాపాలది లాలూచీ కుస్తీ అన్నారు. ఓటింగ్ సమయానికి కూడా బిల్లులో అన్ని రాష్ట్రాలకు 50 సీట్లు పెంపు అంశాన్ని

టిడిపి వైకాపాలు
**రాష్ట్ర ద్రోహపు పార్టీలు**
వైకాపా టీడీపీలది
**విచిత్రబంధం**
ఢిల్లీలో దోస్తీ
**గల్లీలో కుస్తీ**
చంద్రబాబు జగన్ లది
**లాలూచీ కుస్తీ**

చేర్చలేదన్నారు.2011 జనాభా లెక్కల ఆధారంగా సీట్ల పెంపు ఉంటుందని బిల్లులో చేర్చడం జరిగింది.దీనివలన కుటుంబ నియంత్రణ సమర్థవంతంగా నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాలలో లోక్సభ సీట్లు సంఖ్య తగ్గుతుంది. దీనివలన ఆంధ్రప్రదేశ్లో మూడు లోక్సభ సీట్లు,తెలంగాణలో ఒకటి,తమిళనాడులో ఎనిమిది, కేరళలో ఏడు తగ్గుతాయి. టిడిపి, జనసేన, వైకాపా బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడం రాష్ట్రానికి,దక్షిణాది రాష్ట్రాలకు ద్రోహం చేయడమే అవుతుందని తులసి రెడ్డి అన్నారు.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి

## ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### దేశభాషలందు తెలుగు లెస్స

### ఇండియా నుండి ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ కోలా ప్రసాద్



**పులివెందుల - సూర్య వాస్తవం:** థాయిలాండ్ దేశంలోని బ్యాంకాక్లో ఉన్న ఐఖ్య రాజ్య సమితి భవనం, యునైటెడ్ నేషన్ సెంటర్(యు ఎన్ సి సి) లో జరిగిన అంతర్జాతీయ ఐఖ్య రాజ్య సమితి సదస్సుకు భారతదేశం నుండి దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగాసదస్సులో ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాలు, దేశ ఆర్థికాభివృద్ధి, విద్య, వైద్యం, నిరుద్యోగిత, మత సామరస్యం, ప్రభుత్వ పాలసీల విధానాల గురించి ఆయన మాట్లాడారు.ప్రస్తుతం జరుగు తున్న ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను అనుసరించి, అన్ని దేశాలు శాంతిని కలిగి ఉండాలని, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరారు. ఈ యుద్ధాల వల్ల కలిగిన నిత్యావసర వస్తువుల కొరత, ధరల పెంపు, గ్యాస్ నిలుపుదల, ఇతర నష్టాల గురించి సదస్సులో ప్రసంగించారు.ఈ ఐఖ్య రాజ్య సమితిఅంతర్జాతీయ సదస్సుకు దాదాపు ఈ సమావేశాల కు దాదాపుగా 110 దేశాల నుండి ప్రభుత్వ రాయబారు లు, మంత్రులు, అంబాసోడర్ లు, కాన్సులేట్ జనరల్స్, ప్రపంచ దేశాల సామాజిక సంస్థల ప్రతినిధులు, ఎన్నికల వ్యూహకర్తలు ఈ సమావేశాలలో పాలు పంచుకోవడం జరిగిందన్నారు. ప్రపంచ ప్రజలుశాంతియుతంగా ఉండాలని, దేశ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ, తనకు సదస్సులో పాల్గొనే అలాంటి అద్భుతమైన అవకాశం దొరకడం తన దేశం ఇచ్చిన సువర్ణ అవకాశం అని ఆయన తెలిపారు , తాను పుట్టిన నేలకు, భారత మాతకు ,శిరస్సు వంచి పాదాభివందనం చేసి, ఐక్య రాజ్య సమితి భవనంలో రెప రెప లాడే మన దేశ జాతీయ జెండాను ఆవిష్కరించి ,తన ప్రసంగాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.ఈ ప్రసంగంలో తన తల్లిదండ్రులను గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు.జై జవాన్- జై కిసాన్ ,జై హింద్ అని తన ఉపన్యాసాన్ని ఆయన ముగించినట్లు తెలిపారు.


## బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని చేపట్టిన అడవికంపల్లె ఉపాధ్యాయులు



**రాయచోటి-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి, డ్రాపౌట్లను తగ్గించడానికి, ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలను ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ 'బడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని చేపట్టిన విషయం అందరూ తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం అడవికమ్మపల్లి మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పురవీధులలో తిరిగి బడి ఈడు పిల్లల్ని, ప్రవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులను చేర్పించుకోవడం జరిగింది. ఈసందర్భంగాఉపాధ్యాయులు మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి గాను మన ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు ఈనెల 17వ తేదీ నుండి 23 వరకు నిర్వహించబడతాయని, తల్లిదండ్రులు స్థానికులకు తెలియజేసారు. సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్చిన విద్యార్థులకు లభించే రాయితీలను,సౌకర్యాలను, ప్రయోజనాలనుతల్లిదండ్రు లకు తెలియజేయ డం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఉపాధ్యాయుడు, ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి విలేకరులతో మాట్లాడుతూఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం పాఠశాల ఉపాధ్యాయులు తమ పరిధిలోని బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి, వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పిస్తారని చెప్పారు. అలాగే పాఠశాలలు ప్రవేశాల పెంపుకు కృషి చేస్తారన్నారు. ప్రాథమిక పాఠశాలో ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉన్నత పాఠశాలలో తప్పక చేర్పించేలా ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన అందరిని కోరారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు అశోక్, నాగరాజు, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లాలో ఇంటర్ ఫలితాల దిగజారుడు
# విద్యా వ్యవస్థలో లోపాలు బహిర్గతం

## పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న




**అన్నమయ్య - బ్యూరో సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాలో తాజాగా విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విద్యా వ్యవస్థలో ఉన్న తీవ్రమైన లోపాలను స్పష్టంగా బయటపెడుతున్నాయని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ఆరోపించారు. శనివారం రాయచోటి పట్టణంలోని డైట్ పాఠశాలలో మాట్లాడుతూ, మొదటి సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కేవలం 62%కే పరిమితమవ్వగా, రెండో సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత 67%తోనే నిలిచిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా 26వ స్థానానికి పడిపోవడం విద్యా ప్రమాణాల క్షీణతకు సంకేతమని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందని ఆయన అన్నారు. గుర్రంకొండ ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత 7%, రైల్వే కోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9%, రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 13% మాత్రమే నమోదవ్వడం పరిస్థితి తీవ్రతను చూపుతుందని పేర్కొన్నారు. రెండో సంవత్సరం ఫలితాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగిందని, గుర్రంకొండలో 6%, పీలేరు 33%, కలికిరి 35% మాత్రమే విద్యార్థుల ఉత్తీర్ణత నమోదవ్వడం విద్యా వ్యవస్థలో సంక్షోభాన్ని వెల్లడిస్తోందన్నారు. ఈ పరిస్థితికి విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని ఆయన వివరించారు. డివిఈఓ రవి, ఆర్జెడి సురేష్ కుమార్ నిర్లక్ష్యం వల్లే జిల్లాలో విద్యా ప్రమాణాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. గతంలో కడప జిల్లాలో వారి పదవీకాలంలో కూడా ఇలాంటి ఆరోపణలు వినిపించాయని గుర్తు చేశారు. బోధన ప్రమాణాలు, ప్రిన్సిపల్స్ బాధ్యతలపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో అవ్యవస్థలు, మార్కుల కేటాయింపులో స్పష్టత లేకపోవడం వంటి అంశాలు పరిస్థితిని మరింత దిగజార్చాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అవినీతి జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో సంబంధాల నేపథ్యంలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాల వల్ల ప్రధానంగా నష్టపోయింది విద్యార్థులేనని ఆయన స్పష్టం చేశారు. తగిన బోధన, సరైన మార్గదర్శకత్వం లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోలేకపోయారని, వారి భవిష్యత్తుపై దీని ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల శాతం తగ్గిపోవడం కేవలం గణాంకం మాత్రమే కాకుండా, వారి కలలు, ఆశయాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో విద్యా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించాలని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పీడీఎస్ యు నాయకులు ఖాదర్ భాష, భాస్కర్, మహేశ్వర్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ శక్తి అమ్మ స్వామి ఆశీర్వాదాలు పొందిన మంత్రి మండిపల్లి

**అన్నమయ్య బ్యూరో సూర్య వాస్తవం:** తమిళనాడులోని వేలూరులో ఉన్న శ్రీ లక్ష్మీ నారాయణి గోల్డెన్ టెంపుల్ సృష్టికర్త శ్రీ శక్తి అమ్మ స్వామి వారి ఆశీస్సులు తీసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా శ్రీ శక్తి అమ్మ స్వామి వారిని మర్యాదపూర్వకంగా కలిసి, వారి చేతుల మీదుగా ఆశీర్వాదాలు స్వీకరించారు. మంత్రి గారిని స్వామి వారు ఆప్యాయంగా ఆశీర్వదించి, ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆశీర్వచనాలు అందించారు. ఈ భేటీ ఆధ్యాత్మికంగా ఎంతో స్ఫూర్తిదాయకమైందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల కోసం సేవ చేసే దిశగా మరింత కట్టుబడి ముందుకు సాగుతానని ఈ సందర్భంగా తెలిపారు.

# మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం





ఉరవకొండ పట్టణంలోని దేవాంగ కళ్యాణమండపంలో మహిళలు, బాలికల భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఇపియస్ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ ఎ.శ్రీనివాస్, అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్ మహ బూబ్ బాషా సమక్షంలో సీఐలు మహనంది, రాజు, వెంకటేశ్వర్లు మరియు ఎస్సైలు, సిబ్బంది ఎంపీడీఓ రవిప్రసాద్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీలు మాట్లాడుతూ మహిళా భద్రతకు ప్రభుత్వం మరియు పోలీసుశాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా ధైర్యంగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు గురిచేసినా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం "శక్తి యాప్" ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్‌లో బటన్ నొక్కగానే పోలీసులు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను రక్షిస్తారని వివరించారు. జిల్లాలో ఎస్పీ నేతృత్వంలో మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేశారన్నారు. క్రైం అగనెస్ట్ ఉమెన్ నియంత్రించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ మహిళల భద్రతను బలోపేతం చేయాలనే సంకల్పంతో స్త్రీరక్ష పోర్టల్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రతి ఇంటా మహిళలు, చిన్నారుల సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు పని చేస్తున్నామన్నారు. పోలీసు స్టేషన్ వెళ్లకుండా ఇంటి నుండే మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం పొందడమే స్త్రీరక్ష పోర్టల్ ఉద్దేశ్యమన్నారు. ఒకవైపు స్త్రీరక్ష పోర్టల్ ... మరోవైపు శక్తి యాప్ సేవలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## అంజన్నకు విశేష పూజలు



**సింహాద్రిపురం సూర్య వాస్తవం :** సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం ,మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## జంక్ ఫుడ్ తీసుకోవడం వలన చిన్నపిల్లల్లో జీర్ణ సమస్యలు



**లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం:** చిన్నపిల్లలు జంక్ ఫుడ్ తీసుకోవడం వలన జీర్ణ సమస్యలు వస్తాయని దీంతో గర్భిణీలు ఎదుగుదల ఉండదని అంగన్వాడీ సూపర్వైజర్ మస్తానమ్మ పేర్కొన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం దప్పేపల్లి గ్రామంలో చిన్నపిల్లలకు బాలింతలకు గర్భవతులకు ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశం మాట్లాడుతూ గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఆకుకూరలు పాలు పండ్లు గుడ్లు వల్ల పిండాభివృద్ధి చెందుతుందని ఆమె తెలియజేశారు. అంతేకాకుండా సి విటమిన్ జామ ముసిరి నిమ్మ ఆరంజ్ పళ్ళు తీసుకుంటే వంద రోజుల్లో మంచి ఫలితాలు కనిపిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పెరట్లో ప్రకృతి ఎరువులతో కూరగాయలు పండించుకొని ఉపయోగించాలన్నారు. అంతే కాకుండా ప్రతి అంగన్వాడి సెంటర్ లోనూ పెరటి కూరగాయలు పెంపకం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషకాహార లోపాన్ని నివారిస్తేనే
# ఆరోగ్యకర సమాజ నిర్మాణం



**అనంతపురం:** పోషకాహార లోపాన్ని నివారిస్తేనే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని న్యూ రెవెన్యూ కాలనీ-43 మహిళా పోలీస్ మున్నీ అన్నారు. అనంతపురం నవోదయ కాలనీ-5 అంగన్వాడీ కేంద్రం పరిధిలో అంగన్వాడీ వర్కర్ గుజ్జల కమల ఆధ్వర్యంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా పోషక పదార్థాల ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆ తరువాత తల్లులతో సమావేశం నిర్వహించారు. పిల్లలు, తల్లుల్లో పోషకాహార లోపాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోషకాహార లోపం రాబోయే తరాల ఆరోగ్యం, అభ్యసనా సామర్థ్యం, ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. పోషకాహార లోపం ప్రభావం ఐదేళ్లలోపు పిల్లలు, తల్లుల మరణాల రేటుపై కూడా ఉంటుందన్నారు. శారీరక, మానసిక ఎదుగుదల కుంటుపడుతుందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలు, మహిళల్లో పోషకాహార స్థితిని మెరుగుపరచడమే లక్ష్యంగా పోషణ్ పక్వాడ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పోషణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలు, కౌమార దశలోని వారు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల పోషకాహార ఫలితాలు మెరుగుపర చాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పని సరని అభిప్రాయ పడ్డారు. పోషకాహార లోపంతో అనేక సమస్యలు వెంటాడుతాయన్నారు. ముఖ్యంగా ఎదగడానికి, నేర్చుకోవడానికి, అభివృద్ధి చెందడానికి అవసరమైన పోషకాలు చాలా అవసరమవుతాయని ఏ.ఎన్. ఎం అనిత స్పష్టం చేశారు. ముందుగా అందుబాటులో చౌకగా దొరికే పోషకాహార పదార్థాల గురించి వివరించారు. అంగన్వాడీ వర్కర్ వరలక్ష్మి, ఆశా కార్యకర్త వరలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలతో ప్రయాణికుల మన్ననలు పొందండి
### ఆర్టీసీ ఉన్నతాధికారులు



**పులివెందుల సూర్య వాస్తవం:** ప్రయాణికులకు సమయపాలనతో మెరుగైన సేవలు అందించి ప్రయాణికుల మన్ననలు పొందే విధంగా ఆర్టీసీ సిబ్బంది పనిచేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. శనివారం పులివెందులలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో కడప జోన్ ఈడీ ఎస్టిపి రాఘవ కుమార్,కడప రీజినల్ మేనేజర్ గోపాల్ రెడ్డి పులివెందల డిపోను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు సలహాలను అందిస్తూ డిపోలో ఎక్కువగా ఫెయిల్యూర్స్ ఉన్నాయని సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకొని ప్రయాణికులకు మంచి సౌకర్యవంతమైన సమయపాలన పాటిస్తూ సురక్షితంగా వారి గమ్యస్థానాలను చేర్చేలా బస్సులు తయారు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల డిఎం ప్రేమకుమార్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో ఏపీ మోడల్ స్కూల్ అన్నమయ్య జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం మెడల్ తో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ బాబు ఎంపీసీ 1000/937 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. బైపీసీలో షేక్ భాను 1000/9 18 మార్కులు సాధించారు. 8 మంది విద్యార్థులు 900 పైగా మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 400 పైగా పది మంది విద్యార్థులు మార్కులు సాధించి పాఠశాల ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చారని ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్ అధ్యాపకులు రాజశేఖర్ నాగయ్య షర్ఫుద్దీన్ శ్రీనివాసులు జమ్రుద్వేగం వాసవి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలసీతారామన్ తో
## భేటీ అయిన రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ - సూర్య వాస్తవం:** ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ భేటీ అవ్వడం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ? ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులు, బడ్జెట్ అవసరాలు మరియు ఎదుర్కొంటున్న సవాళ్లను కేంద్ర మంత్రికి వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించిన నిధుల విడుదలపై చర్చలు జరిగాయి. విభజన హామీల అమలు, వెనుకబడిన జిల్లాలకు అందాల్సిన నిధులు మరియు అదనపు రుణ పరిమితి వంటి అంశాలపై కేంద్రం నుంచి పూర్తి సహకారం కావాలని పయ్యావుల కేశవ్ కోరారు. అమరావతి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వెసులుబాటు మరియు పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాల ఆమోదంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు మరియు కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల విషయంలో స్పష్టత తీసుకోవడానికి ఈ మర్యాదపూర్వక భేటీ ఒక వేదికగా నిలిచింది.

## పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యవంతమైన సమాజం



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యవంతమైన సమాజం అవుతుందని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ ఎన్ డి షపినాయక్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రాంతము రాష్ట్రము దేశము బాగుపడుతుందని ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని తడి పొడి చెత్తను వేరు వేరు చేసి గ్రామ సంపద కోసం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిందని ప్రతి ఒక్కరూ చెత్తను ఎక్కడబడితే అక్కడ పారేయకూడదు అన్నారు. ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దడమే ప్రతి ఒక్కరి లక్ష్యమని ఆయన అన్నారు. అనంతరం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి మండల తెలుగు యువత నాయకుడు పకీరయ్య ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జీవామృతంతో విత్తనాలను శుద్ధి చేస్తే మొలకల శాతం పెరుగుతుంది



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** జీవామృతంతో విత్తనాలను శుద్ధి చేసి సాగు చేస్తే మొలక శాతం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఎన్ ఎఫ్ ఐ యశోదమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులచే ప్రకృతి వ్యవసాయం ఎరువులు తయారు చేయడం కషాయాలు ఎలా తయారు చేయాలి ప్రకృతి ఎరువుల వల్ల పంటకు లాభ దాయకం ఈ విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తన పైలటైజేషన్ విధానం మొక్కలకు ప్రారంభ దశలోనే పోషకాలు అందడం విత్తనాలు వ్యాధుల నుండి రక్షణ పొందడం జరుగుతుందన్నారు. ఈ కషాయాల వల్ల పంటకు ఎంతో లాభదాయకమన్నారు. ఘనజీవామృతం ద్రువ జీవామృతం తయారుచేసుకునే విధానాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఘనజీవామృతం నేలలో సూక్ష్మజీవులను పెంచే నేల సారాన్ని మెరుగుపరుస్తూ ద్రువ జీవామృతం పంటలకు చీడపీడల నివారణకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కషాయాల వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి పంటలు మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జెండర్ ఇంటర్నల్ సురేష్ ప్రకృతి వ్యవసాయ అధికారులు సరస్వతి ఎన్ఏటి రమణ తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి లో పోషన్ పక్వాడ కార్య క్రమాలు ఘనంగా నిర్వహించిన ఐసిడిఎస్ సి.డి.పి.ఓ




**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలోని బి.సి.కాలనీ 1, మరియు 2,అంగన్వాడీ సెంటర్లలో శనివారం ఉదయం పోషన్ పక్వాడ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించా రు.ఐసి డి ఎస్ సి.డి.పి.ఓ ఆదేశాల మే రకు పోషన్ పక్వాడ కార్యక్రమం లో భాగంగా గుత్తి టౌన్ బి.సి.కాలనీ 1,2,అంగన్వాడీ సెంటర్లలో సూపర్ వైజర్ రాజే శ్వరి ఆధ్వర్యంలో అవ గాహన కార్యక్రమం ఏర్పాటు చేశా రు.ఎండలు ఎక్కువగా ఉన్నందు న చిన్న పిల్లలు గర్భిణులు వృద్దులు బ యటకు రాకుండా ఉండాలి.గర్భిణు లు బాలింతలు 0-3,3-6,సం,చి న్నారులకు తీసుకోవలసిన సమతు ల ఆహారం గురించి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అంది స్తున్న పౌష్టికాహారం సేవలను ప్రతి ఒక్కరూ ఉప యోగించుకోవాలని తెలిపారు.చిన్నారులకు జింక్ ఫుడ్ తినకూడదని,ప్లాస్టిక్ కవర్లలో వచ్చె తిను బండారాలను దూరం పెట్టాల ని సూపర్ వైజర్ రాజేశ్వరి తెలిపా రు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రాజేశ్వరి,మహిళా పోలీస్ రాణీ, అంగన్వాడీ టీచర్ నాగమ్మ ఆయా లు అక్కమ్మ,వరాలమ్మ పిల్లలు,త ల్లులు పాల్గొన్నారు.

# ప్రాణరక్షణ పాఠాలు నేర్పుతున్న
# నాయుడుపేట అగ్నిమాపక సిబ్బంది - వరుసగా అవగాహన కార్యక్రమాలు

### విద్యాసంస్థల్లో చైతన్యం... పరిశ్రమలు, పెట్రోల్ బంకుల్లో ప్రచారం

### సిపిఆర్, ఎమర్జెన్సీ రిస్క్యూ డెమోలు - ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

### "భయాన్ని దాటితేనే భద్రత" -విద్యార్థులకు ధైర్యం నింపిన అగ్నిమాపక అధికారి కె. సునీల్ కుమార్

## సేవే లక్ష్యం... భద్రతే సందేశం - కె .సునీల్ కుమార్





**నాయుడుపేట, సూర్య వాస్తవం:** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నాయుడుపేట లో అగ్నిమాపక సిబ్బంది చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు రోజు రోజుకు విస్తరించి ప్రజల్లో భద్రతపై చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి. ఏప్రిల్ 14 నుండి 20 వరకు జరుగుతున్న ఈ వారోత్సవాల భాగంగా, నాల్గవ మరియు ఐదవ రోజుల్లో నిర్వహించిన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 1944 ఏప్రిల్ 14న జరిగిన ముంబై పేలుడు ఘటనలో ప్రాణత్యాగం చేసిన అగ్నిమాపక వీరులను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వారి త్యాగస్ఫూర్తిని స్మరిస్తూ, సమాజంలో భద్రతా సంస్కృతిని బలోపేతం చేయడం ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు.

**విద్యాసంస్థల్లో అవగాహన జ్వాల**

నాల్గవ రోజు నాయుడుపేట అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీ కె. సునీల్ కుమార్ (ఎస్ ఎఫ్ ఓ) ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని శ్రీ వేమ జూనియర్ కాలేజ్, నవభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, గురుకుల విద్యాలయాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యంతో ప్రత్యక్షంగా మమేకమై అగ్ని ప్రమాదాల నివారణపై సులభమైన, మార్గదర్శకాలు అందించారు. కరపత్రాలు పంచడం, పోస్టర్లు అతికించడం ద్వారా భద్రతా నియమాలను వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, తమని తాము ఎలా కాపాడుకోవాలి, ఇతరులను ఎలా రక్షించాలి అనే అంశాలను సమగ్రంగా తెలియజేశారు. ప్రత్యేకంగా ప్రాణాపాయ సమయంలో కీలకమైన సి.పి.ఆర్ (హృదయ-శ్వాసకోశ పునరుజ్జీవన చర్య) మరియు ఎమర్జెన్సీ రిస్క్యూ విధానాలను ప్రత్యక్ష డెమోల ద్వారా చూపించి, విద్యార్థులతో స్వయంగా చేయించి ప్రాక్టికల్ అవగాహన కల్పించారు.

**పరిశ్రమలు, పెట్రోల్ బంకుల్లో భద్రతా ప్రచారం**

ఐదవ రోజు కార్యక్రమాల్లో భాగంగా నాయుడుపేట అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమలు మరియు ఇంధన కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆరబిందో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, ఏ జి ఒ పి గ్యాస్ స్టేషన్‌లలో సిబ్బంది, యాజమాన్యానికి కరపత్రాలు పంచుతూ, పోస్టర్లు అతికిస్తూ అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రథమ చికిత్స పద్ధతులు, ఎమర్జెన్సీ రిస్క్యూ విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించి, అక్కడి సిబ్బందితో స్వయంగా చేయించి అవగాహన పెంపొందించారు.తదుపరి భారత్ పెట్రోలియం, ఇండియన్ పెట్రోలియం ఫిల్లింగ్ స్టేషన్లు, గ్యాస్ గోదాముల వద్ద కూడా భద్రతా సూచనలు తెలియజేస్తూ, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలను వివరించారు.

**సేవలో నిబద్ధత - సమాజానికి ఆదర్శం**

అగ్నిమాపక అధికారి శ్రీ కె. సునీల్ కుమార్ నాయకత్వంలో సిబ్బంది కేవలం ప్రమాద సమయాల్లోనే కాకుండా, ముందస్తు అవగాహన ద్వారా ప్రమాదాలను నివారించడంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల రక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వారి సేవాభావం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది.ఈ కార్యక్రమాల్లో పి. హరి ప్రసాద్ ఎల్ ఎఫ్, గోను. సుందరయ్య లీడింగ్ ఫైర్ మ్యాన్, ఎం. మురళి డి ఓ పి , ఏ. సందీప్ ఎఫ్ ఎం, సిహెచ్. నాగరాజు ఎఫ్ఎం, జి. పరశురామయ్య ఎఫ్ఎం , హెచ్. బాలాజీ హెచ్ జి , కె. పోలయ్య హెచ్‌జి తదితర సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంచడమే లక్ష్యంగా తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందిస్తున్న అగ్నిమాపక సిబ్బంది నిజమైన సమాజ రక్షకులని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు సమాజంలో అప్రమత్తతను పెంపొందిస్తూ, ప్రాణ-ఆస్తి రక్షణలో కీలకంగా మారుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్.( పి ఎం డి ఎస్) ప్రకృతి వ్యవసాయం గురించి తెలియజేసిన
## సింగనమల మండల వ్యవసాయ అధికారి ఎన్ అన్వేష్ కుమార్






**శింగనమల - సూర్య వాస్తవం:** సోదన పల్లి గ్రామానికి చెందిన రైతు పరశురాముడు S/O.పుల్లన్న పొలం సర్వే నంబర్ 361( శింగనమల రెవెన్యూ గ్రామం) నందు గల 2 ఎకరాలలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పి ఎం డి ఎస్) లో భాగంగా అనుములు (5 కేజీలు), అలసంద (5 కేజీలు), కందులు (5 కేజీలు), ఆముదము (5కేజీలు), గోరు చుక్కుడు (5కేజీలు) మరియు బయో డైవర్సిఫాయిడ్ పంటలు అనగా గోంగూర (1కేజీ), సజ్జలు (1కేజీ), కొర్ర (1కేజీ) ఇలా దాదాపు 28 నుండి 30కేజీ ల విత్తనాల ను 12 గంటల ముందు తయారు చేసుకున్న బీజామృతం తో విత్తన శుద్ధి చేసుకొని, తదుపరి బంక మన్ను, ఘన జీవామృతం, బూడిద ను కలుపుకోవాలి.. ఇలా విత్తనాలకు కోటింగ్ ఇవ్వటానికి ఫర్టిలైజేషన్ అంటారు.ఇలా ఫర్టిలైజేషన్ చేసుకున్న విత్తనాలు 40 రోజుల వరకు వర్షభావ పరిస్థితి లో కూడా జీవాన్ని కలిగి ఉంటాయి.

6 ఎం ఎం నుండి 10 ఎం ఎం వర్షం కురవగానే విత్తనం మొలకెత్తగలదు ఇలా ఫర్టిలైజేషన్ చేసుకున్న విత్తనాలను ట్రాక్టర్ ద్వారా రైతు పరశురామ్ పొలం లో విత్తటం జరిగింది.జూన్ లో రైతు సాగు చేయబోయే ప్రధాన పంట కు ముందు ఇలా ప్రీ మాన్సూన్ డ్రై షోయింగ్ సాగు చేయటం వలన నేల కోతను అరికట్టబడును, నేలలో ఉండే పంటకు మేలు చేసే బ్యాక్టీరియ వృద్ధి చెందును.నేలలో ఉండే తేమ ఆవిరి కాకుండా ఉండగలదు, నత్రజని స్టిరీకరణ జరుగును, పడిన వర్షాన్ని భూమిలో ఇంకెలా చేయబడును, సంవత్సరం పొడవున నేల అధిక సూర్య రష్మీ కి గురికాకుండా మొక్కలచే కప్పబడి ఉండును, పశువుల మేతకు ఉపయోగబడును.నేల సారవంతమై ఖరీఫ్ పంట కు అనువుగా ఉండును. ఈ డెమో కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి, రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జి రామచంద్రుడు (సోదన పల్లి గ్రామం) మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న వ్యవసాయ సిబ్బంది ని వారి వారి గ్రామాలలో రైతులతో ఈ( ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ )విధానం లో పంట ను సాగుచేయించాలని మండల వ్యవసాయ అధికారి యన్. అన్వేష్ కుమార్ తెలియజేశారు



## మల్లన్న సన్నిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన ప్రత్యేక పూజలు టిడిపి నాయకులు

**గుత్తి సూర్య వాస్తవం ఏప్రిల్ 18** గుత్తి గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మ నూరు జయరాం ఆదేశాల మేరకు గుత్తి మండలం బసినపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బిసి మండల అధ్యక్షుడు ఎర్రగుడి రామంజి తలారి నాగరాజు శ్రీశైలం మల్లన్న సన్నిధిలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సంబర్దంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు మరి ఎంతో సేవలు చేయాలని కొనియాడారు ఈ కార్యక్రమంలో. టిడిపి నాయకులు సుంకన్న స్టోర్ డీలర్ సుమన్ వార్డు ఇన్చార్జ్ కొండప్ప. తదితరులు పాల్గొన్నారు

చిరంజీవి, నందమూరి బాలకృష్ణ నటిస్తున్న రెండు ప్రధాన రాబోయే తెలుగు ప్రాజెక్టులలో

# కీలక పాత్రల కోసం మోహన్‌లాల్



చిరంజీవి, నందమూరి బాలకృష్ణ నటిస్తున్న రెండు ప్రధాన రాబోయే తెలుగు ప్రాజెక్టులలో కీలక పాత్రల కోసం మోహన్‌లాల్‌ను పరిశీలిస్తున్నారనే ప్రచారం పెరుగుతోంది.బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిరంజీవి చిత్రంతో ఆయన పేరు ఇప్పటికే ప్రచారంలో ఉండగా, వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న చిత్రంలో కూడా ఆయన చేరవచ్చని తాజా నివేదికలు సూచిస్తున్నాయి.ఈ పరిణామాలు నిజమైతే, మలయాళ సూపర్‌స్టార్ ఒకేసారి రెండు ప్రతిష్టాత్మక తెలుగు చిత్రాలలోకి రావడం ఒక అద్భుతమైన కలయిక అవుతుంది. మోహన్‌లాల్‌కు ఉన్న బలమైన స్క్రీన్ ప్రెజెన్స్, పాన్-ఇండియన్ అప్పీల్ కారణంగా ఆయన ఉనికి చిత్రాలకు గణనీయమైన బలాన్ని చేకూరుస్తుందని భావిస్తున్నారు.ఆసక్తికరంగా, ఈ రెండు భారీ బడ్జెట్ చిత్రాలను 2027 సంక్రాంతికి విడుదల చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారని మునుపటి నివేదికలు సూచిస్తున్నాయి. ఒకవేళ ఈ రెండు ప్రాజెక్టులు తమ టైమ్‌లైన్‌లకు కట్టుబడి ఉంటే, ఒకే పండుగ సమయంలో మోహన్‌లాల్ రెండు పోటీ చిత్రాలలో కనిపించడంతో ఇది ఒక ప్రత్యేకమైన బాక్సాఫీస్ దృశ్యాన్ని సృష్టించవచ్చు.ఇలాంటి పరిస్థితి అభిమానులలో ఉత్సుకతను రేకెత్తించడమే కాకుండా, పండుగ సీజన్‌కు మరింత ఉత్సాహాన్ని జోడిస్తుంది. అయితే, ఇప్పటివరకు ఈ రెండు ప్రాజెక్టులలో దేనిలోనైనా ఆయన భాగస్వామ్యం గురించి ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు.ఒకవేళ ఇది ఖరారైతే, ఇటీవలి కాలంలో అత్యంత ఆసక్తికరమైన నటీనటుల ఎంపిక పరిణామాలలో ఒకటిగా ఇది నిలవవచ్చు, తద్వారా సినీ ప్రేమికులకు సంక్రాంతి 2027 మరింత ఉత్సాహాన్ని కలిగిస్తుంది.అయితే, చిరు - బాబీ సినిమాకు సంబంధించి కొనసాగుతున్న జాప్యం నేపథ్యంలో, డేట్స్ సమస్యల కారణంగా లాలెట్టన్ తప్పుకుంటారేమోనన్న అనిశ్చితి కూడా నెలకొంది. ప్రస్తుతానికి, రాబోయే రోజుల్లో పరిస్థితులు ఎలా మారుతాయనే దానిపైనే అంతా ఆధారపడి ఉంది.

# ‘భూత్ బంగ్లా’కు మిశ్రమ సమీక్షలు,

## ప్రేక్షకుల నుండి సమానంగా భిన్నాభిప్రాయాలు

మిశ్రమ స్పందన వస్తున్నప్పటికీ ‘భూత్ బంగ్లా’తో అక్షయ్ కుమార్ బాక్సాఫీస్ విజయాన్ని అందుకోగలదా? ట్రేడ్ వర్గాల్లో ఇప్పుడు ఇదే పెద్ద ప్రశ్నగా వినిపిస్తోంది. విడుదలైన మొదటి రోజు నుంచే ‘భూత్ బంగ్లా’కు మిశ్రమ సమీక్షలు, ప్రేక్షకుల నుండి సమానంగా భిన్నాభిప్రాయాలు వచ్చాయి.కొందరు దీనిలోని హారర్-కామెడీ అంశాలను ప్రశంసించగా, మరికొందరు ఇందులో నిలకడ లోపించిందని భావించారు. అయినప్పటికీ, ఈ చిత్రం మొదటి రోజు సుమారు ?25 కోట్ల మంచి ఓపెనింగ్ సాధించి, చిత్రానికి బలమైన పునాది వేసింది. ఇప్పుడు వారాంతపు వసూళ్లు కూడా దీనికి అనుకూలంగా ఉన్నాయి. ఈ చిత్రం ప్రస్తుతం బుక్‌మైషోలో ట్రెండింగ్‌లో ఉంది. గంటకు దాదాపు 20,000 టిక్కెట్లు అమ్ముడవుతున్నాయని సమాచారం. ఇది ప్రేక్షకుల ఆసక్తి ఇంకా చెక్కుచెదరలేదనడానికి ప్రోత్సాహకరమైన సంకేతం. ఇలాంటి ట్రెండ్‌లు, ఒక చిత్రం పూర్తిగా తిరస్కరించబడలేదని, ఇంకా ఎదగడానికి ఆస్కారం ఉందని తరచుగా సూచిస్తాయి.చారిత్రాత్మకంగా చూస్తే, హిందీ హారర్ చిత్రాలు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకున్నాయి. ఈ జానర్‌కు బలమైన ప్రేక్షకాదరణ ఉంది, వారు ముఖ్యంగా వారాంతాల్లో థియేటర్లకు వస్తుంటారు.ఇప్పుడు, అక్షయ్ కుమార్ ఈ ఊపును సద్వినియోగం చేసుకోగలడా లేదా అనే దానిపై అందరి దృష్టి ఉంది. ఈ చిత్రం వారాంతం మొత్తం నిలదొక్కుకుని, వారం మధ్యలో కూడా పర్వాలేదనిపించే స్థాయిలో ఆడితే, తొలుత మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ‘భూత్ బంగ్లా’ ఒక మంచి ప్రదర్శన కనబరిచే చిత్రంగా నిలవవచ్చు.





# సూపర్‌కింగ్స్ చిత్తు!

- -- 10 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపు
- -- విజృంభించిన ఈషన్ మలింగ, నితీశ్ కుమార్
- -- అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ అర్ధ సెంచరీలు

హైదరాబాద్ 194/9, చెన్నై 184/8

**సన్‌రైజర్స్ హైదరాబాద్ మూడో విజయం సాధించింది. పసుపు సంద్రాన్ని తలపించిన ఉప్పల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌పై 10 పరుగుల తేడాతో మెరుపు విజయం సాధించింది. 195 పరుగుల ఛేదనలో సన్‌రైజర్స్ బౌలర్లు ఈషన్ మలింగ (3/29), నితీశ్ కుమార్ రెడ్డి (2/31) విజంభించటంతో చెన్నై సూపర్‌కింగ్స్ 184 పరుగులకే పరిమితమైంది. అభిషేక్ శర్మ (59), హెన్రిచ్ క్లాసెన్ (59) అర్ధ సెంచరీలతో తొలుత సన్‌రైజర్స్ హైదరాబాద్ 194 పరుగులు చేసింది. సీజన్లో ఆరు మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్‌కు ఇది మూడో విజయం.**



**హైదరాబాద్, సూర్య వాస్తవం:** సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లు మరోసారి మెప్పించారు. చెన్నై సూపర్‌కింగ్స్‌ను ఛేదనలో కట్టడి చేసి 10 పరుగుల తేడాతో సీజన్లో మూడో విజయాన్ని అందించారు. పేసర్లు ఈషన్ మలింగ (3/29), నితీశ్‌కుమార్ రెడ్డి (2/31) సహా శివాంగ్ కుమార్ (1/18), సకిబ్ హుస్సేన్ (1/32) సమిష్టిగా రాణించటంతో ఛేదనలో సూపర్‌కింగ్స్ చతికిల పడింది. మాథ్యూ షార్ట్ (34, 30 బంతుల్లో 3 ఫోర్లు), ఆయుశ్ మాత్రె (30, 13 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) మెరిసినా.. ఒత్తిడిలో వికెట్లు కోల్పోయారు. 20 ఓవర్లలో 8 వికెట్లకు 184 పరుగులకే సూపర్‌కింగ్స్ పరిమితమైంది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 194 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (59, 22 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (59, 39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో దంచికొట్టారు. మూడు వికెట్లతో మెరిసిన ఈషన్ మలింగ ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా నిలిచాడు. గాయం నుంచి కోలుకుంటున్న ఎం.ఎస్ ధోని జట్టుతో పాటు హైదరాబాద్‌కు వచ్చినా.. బరిలోకి దిగలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

### సూపర్‌కింగ్స్ చతికిల

ఛేదనలో ఫామ్‌లో ఉన్న ఓపెనర్ సంజు శాంసన్ (7) ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే అవుటయ్యాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (19), ఆయుశ్ మాత్రె (30) రెండో వికెట్‌కు ధనాధన్ భాగస్వామ్యం అందించారు. పవర్‌ప్లేలో ఆయుశ్ మాత్రె ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగాడు. ఈ జోడీ 21 బంతుల్లోనే 51 పరుగులు జోడించింది. దీంతో పవర్‌ప్లేలో సూపర్‌కింగ్స్ 76 పరుగులు చేసింది. కానీ మూడు వికెట్లతో సన్‌రైజర్స్ సైతం రేసులోనే నిలిచింది. మాథ్యూ షార్ట్ (34), సర్ఫరాజ్ ఖాన్ (25) వికెట్ల పతనం నిలువరించారు. 46 పరుగుల భాగస్వామ్యంతో సన్‌రైజర్స్ బౌలర్లను ఒత్తిడికి గురి చేశారు. 10 ఓవర్లలో 111 పరుగులు చేసిన సూపర్‌కింగ్స్.. గెలుపు దిశగా సాగుతున్నట్టే అనిపించింది. దీనికి తోడు సన్‌రైజర్స్ పేలవ ఫీల్డింగ్‌తో విలువైన పరుగులు సమర్పించుకుంది. మ్యాచ్‌పై సన్‌రైజర్స్ పట్టు కోల్పోతుందనే తరుణంలో ఈషన్ మలింగ మాయ చేశాడు. మాథ్యూ షార్ట్, సర్ఫరాజ్ ఖాన్ సహా డెవాల్డ్ బ్రెవిస్ (0) వికెట్లతో సూపర్‌కింగ్స్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు. 154/7తో సూపర్‌కింగ్స్ ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఆఖర్లో జెమీ ఓవర్టన్ (16), అన్షుల్ కాంబోజ్ (13) ఓటమి అంతరాన్ని కుదించారు. 20 ఓవర్లలో 8 వికెట్లకు సూపర్‌కింగ్స్ 184 పరుగులే చేసింది. 10 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ మెరుపు విజయం సాధించింది.

### బౌలర్ల సమిష్టి ప్రదర్శన

సన్‌రైజర్స్ బౌలర్లు మరోసారి స్వల్ప స్కోరును కాపాడుకున్నారు. భారీ స్కోర్లు నమోదయ్యే పిచ్‌పై బౌలర్లు సూపర్‌కింగ్స్ బ్యాటర్లను కట్టడి చేశారు. ఆరంభంలో ధారాళంగా పరుగులు ఇచ్చినా.. మిడిల్ ఓవర్లలో పరుగుల నియంత్రణ పాటించారు. మిడిల్‌లో పది ఓవర్లలో 3 వికెట్లకు 73 పరుగులే ఇచ్చారు. ఇక్కడే మ్యాచ్ సన్‌రైజర్స్ ఖాతాలోకి వచ్చేసింది. యువ పేసర్ ఈషన్ మలింగ (3/29) మూడు కీలక వికెట్లతో విజంభించాడు. సకిబ్ హుస్సేన్ (1/32) ఆఖర్లో అద్భుతంగా బంతులేశాడు. ఒత్తిడిలో వైడ్లు వేసినా.. బ్యాటర్లకు ముకుతాడు వేయటంలో సఫలం అయ్యాడు. నితీశ్ కుమార్ రెడ్డి (2/31), శివాంగ్ కుమార్ (1/18) ఆకట్టుకున్నారు.

### అభిషేక్, క్లాసెన్ అర్ధ సెంచరీలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ మరోసారి భారీ స్కోరు అవకాశాన్ని వథా చేసుకుంది. ఓపెనర్ అభిషేక్ శర్మ (59) 15 బంతుల్లోనే అర్ధ సెంచరీ బాదగా పవర్‌ప్లేలో సన్‌రైజర్స్ 72 పరుగులు చేసింది. కానీ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (23), ఇషాన్ కిషన్ (0) వికెట్లను వరుస బంతుల్లో కోల్పోయింది. అభిషేక్ శర్మను కట్టడి చేసేందుకు సూపర్‌కింగ్స్ ఆఫ్ స్పిన్నర్ మాథ్యూ షార్ట్ పవర్‌ప్లేలోనే మూడు ఓవర్లు సంధించాడు. అభిషేక్ శర్మ అతడి ఓవర్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు సంధించి 25 పరుగులు పిండుకున్నాడు. జోరుమీదున్న సన్‌రైజర్స్‌కు ముకేశ్ చౌదరి రెండు వికెట్ల ఓవర్‌తో బ్రేక్ వేశాడు. అర్ధ సెంచరీ తర్వాత అభిషేక్ సైతం నెమ్మదించాడు. 51 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద శివం దూబె క్యాచ్ వదిలేసినా.. ఓవర్టన్ ఓవర్లో అభిషేక్ వికెట్ పారేసుకున్నాడు. దీంతో సన్‌రైజర్స్ 8 ఓవర్లలో 93/3తో నిలిచింది. 8.5 ఓవర్లలోనే 100 పరుగుల మార్క్ దాటిన హైదరాబాద్.. తొలి పది ఓవర్లలో 112 పరుగులు చేసింది. దీంతో 200 పరుగులు సులభమే అనిపించింది. ఇన్నింగ్స్ ద్వితీయార్థంలో సన్‌రైజర్స్ తడబడింది. ఓ ఎండ్‌లో హెన్రిచ్ క్లాసెన్ (59) నిలబడగా.. కుర్రాళ్లు ఎదురుదాడికి ప్రయత్నించారు. ఐదు ఫోర్లు, 2 సిక్సర్లతో 32 బంతుల్లో క్లాసెన్ సీజన్లో మరో అర్ధ సెంచరీ సాధించాడు. కానీ మరో ఎండ్ నుంచి సరైన సహకారం లభించలేదు. అనికెత్ వర్మ (2), నితీశ్ కుమార్ రెడ్డి (12), సాలిల్ అరోరా (13) నిరాశపరిచారు. ఆఖర్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన లియాం లివింగ్‌స్టోన్ (1) ఐదు బంతుల్లో ఒక్క పరుగే సాధించి తేలిపోయాడు. చివరి పది ఓవర్లలో 82 పరుగులే చేసిన సన్‌రైజర్స్ 6 వికెట్లు చేజార్చుకుంది. డెత్ ఓవర్లలో క్లాసెన్ వికెట్ కోల్పోవటంతో అక్కడ్నుంచి పరుగుల వేటలో సన్‌రైజర్స్ తడబడింది. 20 ఓవర్లలో 9 వికెట్లకు సన్‌రైజర్స్ 194 పరుగులే చేసింది. సూపర్‌కింగ్స్ బౌలర్లలో అన్షుల్ కాంబోజ్ (3/22), జెమీ ఓవర్టన్ (3/37) మూడేసి వికెట్లు పడగొట్టారు. ముకేశ్ చౌదరి (2/21), గుర్జప్‌నీత్ సింగ్(1/34) రాణించారు.

### పసుపు సంద్రంలా ఉప్పల్!


సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇటీవల విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేనంతగా సన్‌రైజర్స్ సొంత మైదాన మ్యాచ్‌లకు గణనీ యమైన డిమాండ్ ఏర్పడింది. కానీ, ఇదంతా మహేంద్రుడు ఉప్పల్‌లో అడుగు పెట్టనంత వరకే అన్నట్టుగా మారింది. రెండేండ్లలో ఎం.ఎస్ ధోని హైదరాబాద్ కు రావటంతో అభిమాన క్రికెటర్‌ను చూసేందుకు అభిమాన గణం ఉప్పల్ స్టేడియంకు పోటెత్తింది. ధోని జెర్సీలతో ఉప్పల్ స్టేడియం పసుపు సంద్రాన్ని తలపించింది. గత రెండు మ్యాచ్‌లతో పోల్చితే సూపర్‌కింగ్స్‌తో మ్యాచ్‌కు టికెట్ల రేట్లను సైతం రెట్టిం పు చేశారు. అయినా, శనివారం నాటి మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో 36770 మంది అభిమానులు స్టేడియానికి పోటెత్తారు. సన్‌రైజర్స్ కంచుకోట ఉప్పల్‌ను సూపర్ కింగ్స్ సొంతగడ్డగా చేసుకున్నట్టు అభిమానుల మద్దతును ఆస్వాదించింది.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను...

# బాధితులకు అందజేసిన జిల్లా పోలీసులు

### మీ మొబైల్ మీ ఇంటికి కార్యక్రమం ద్వారా

### రూ. 1.60 కోట్లు విలువచేసే 804 ఫోన్లు బాధితులకు అందజేసిన అనంత పోలీసులు





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ రికవరీ కార్యక్రమం విశేష ఫలితాలను సాధిస్తూ కొనసాగుతోంది. శనివారం నాడు నిర్వహించిన "మీ మొబైల్ మీ ఇంటికి "కార్యక్రమం ద్వారా సుమారు రూ. 1.60 కోట్ల విలువైన 804 మొబైల్ ఫోన్లు బాధితుల ఇళ్లకు వెళ్లి పోలీసులు అందజేశారు. సంబంధిత సి.ఐ లు, ఎస్సైలు మరియు విలేజ్ పోలీస్ ఆఫీసర్లు ఆయా గ్రామాలకు వెళ్లి బాధితులకు పోగొట్టుకున్న బాధితులకు ఫోన్లను చేర్చారు. శనివారం నాడు అందజేసిన వాటితో కలిపి ఇప్పటివరకు మొత్తం 14,421 మొబైల్ ఫోన్లు(సుమారు రూ. 27.75 కోట్ల విలువ) విజయవంతంగా రికవరీ చేశారు. వీటన్నింటినీ బాధితులకు అందజేశారు. ఈ ప్రయాణం మార్చి 21, 2022 న జరిగిన మొదటి ప్రెస్ మీట్‌తో ప్రారంభమై, అప్పట్లో 131 మొబైల్ ఫోన్లు రికవరీ చేశారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ప్రజలు సులభంగా ఫిర్యాదు చేయడానికి అనంతపురం జిల్లా పోలీసులు చాట్‌బాట్ సేవను ప్రారంభించగా, కేంద్ర ప్రభుత్వం పోర్టల్ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ రెండు వేదికల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 30,120 ఫిర్యాదులు అందాయి.ఆ ఫిర్యాదులలో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి రూ.27.75 కోట్ల విలువచేసే 14,421 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి అందజేయడం జరిగిందిఇతర రాష్ట్రాల నుంచి 1,185 మొబైల్ ఫోన్లు (20 రాష్ట్రాలు) స్వాధీనం చేసుకున్నారు.రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి 2,833 మొబైల్ ఫోన్లు (18 జిల్లాలు) రికవరీ చేశారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల విలువ రూ. 499 నుంచి రూ. 1,41,000 వరకు ఉందని తెలిపారు.ప్రస్తుతం పంపిణీ చేసిన 804 మొబైల్ ఫోన్లలో అనంతపురం జిల్లా నుంచి 760 ఫోన్లు, ఇతర జిల్లాల నుంచి: 38 ఫోన్లు, ఇతర రాష్ట్రాల నుంచి: 6 ఫోన్లు, రికవరీ చర్యలు జిల్లా, రాష్ట్ర సరిహద్దులను దాటి దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఆధునిక సాంకేతికత వినియోగంతో పాటు సమన్వయంతో పనిచేసిన పోలీస్ సిబ్బంది కృషి వల్ల ఈ విజయాలు సాధ్యమయ్యాయి.మొబైల్ ఫోన్ కొనుగోలు విషయంలో ప్రజలకు ముఖ్య సూచనలు : ఆర్టీసీ బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రుల వద్ద తెలియని వ్యక్తుల నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయ కూడదని... బిల్, బాక్స్ లేకుండా పాత మొబైల్ ఫోన్లు కొనకండని తెలిపారు.పాత ఫోన్ కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా సిమ్ పెట్టి పనిచేస్తుందో లేదో పరీక్షించండని మొబైల్ షాప్ యజమానులు అనుమానాస్పద వ్యక్తులు ఫోన్లు అమ్మడానికి వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## భారత జాతీయ చిహ్నాలు ఈరోజు యువతలో ఏ విధమైన భావనను కలిగిస్తున్నాయని మీరు భావిస్తున్నారు?




రాజ్యాంగ ప్రస్తావిక (ప్రీయాంబుల్)లోని విలువలు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయి?
జన గణ మన మరియు వందే మాతరం వంటి చిహ్నాలపై జరుగుతున్న చర్చలను మీరు ఎలా చూస్తారు?
కళ మరియు సంగీతం సమాజంలో ఉన్న అసమానతలను తగ్గించడంలో ఎలా పాత్ర పోషించగలవు?
"వీ ద పీపుల్" అనే భావనను నేటి పౌరులు ఎలా అర్థం చేసుకోవాలి?
రాజ్యాంగ విలువలను బలోపేతం చేయడానికి విద్యా వ్యవస్థలో ఏ మార్పులు అవసరం?
భారత స్వాతంత్ర్యం తర్వాత రూపొందించిన చిహ్నాలు నేటి తరానికి ఎంతవరకు సంబంధితంగా ఉన్నాయి?
ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల బాధ్యతలపై మీ అభిప్రాయం ఏమిటి?
ప్రస్తుత సామాజిక-రాజకీయ పరిస్థితుల్లో సంభాషణ (సఖుశ్రీశీస్త్రబవ) యొక్క ప్రాముఖ్యత ఏమిటి?
మీ రచనలు మరియు ప్రసంగాల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడంలో మీరు ఎదుర్కొన్న ప్రధాన సవాళ్లు ఏమిటి?

# ఎమ్మెల్యే తో కలిసి పేరూరు చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్

### జలధార- జలహారతి లో భాగంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ తో పనులు

## : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

### భూగర్భ జలాలను పెంచే విధంగా చర్యలు :

## ఎమ్మెల్యే పులివర్తి నాని




**తిరుపతి - సూర్య వాస్తవం:** భూగర్భ జలాలను పెంపొందించడం మరియు నీటి భద్రతను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం "జలధార-జలహారతి". 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు..శనివారం స్థానిక చంద్రగిరి నియోజకవర్గం పేరూరు చెరువు వద్ద స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జలధార జలహారతిలో ఎం ఎల్ ఎ పులివర్తి నాని తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూగర్భ జలాలను పెంపొందించడం మరియు నీటి భద్రతను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం "జలధార-జలహారతి". 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి



జిల్లా వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంపై ఈ కార్యక్రమం దృష్టి పెడుతుందనీ అన్నారు. ప్రభుత్వం జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా నీటి నిల్వలు పెరిగి... వ్యవసాయానికి, త్రాగునీరుకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు..ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్నది ఎండాకాలం... వేసవి తాపానికి ప్రజలు, రైతులు ఇబ్బంది పడకూడదన్న ముందస్తు జాగ్రత్తలు భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు.. 100 రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో చెరువులను , నీటి కుంటలను కాపాడుకుంటూ నీటి వనరులను పెంచుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.చెరువు కట్ట సంరక్షణకు జల వనరుల శాఖ అధికారులకు కొన్ని సూచనలు సలహాలు కలెక్టర్, ఎమ్మెల్యే ఇవ్వడం జరిగింది. స్వయంగా ఎమ్మెల్యే ద్విచక్ర వాహనంలో కలెక్టర్ గారిని ఎక్కించుకొని చెరువుగట్ట పరిసర ప్రాంతాలను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జల వనరుల శాఖ ఈ ఈ వెంకటేశ్వర ప్రసాద్, సాగునీటి సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

## అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన

### ఆదిత్య బిర్లా గార్మెంట్స్ సిబ్బందికి సెక్యూరిటీ కీ

# ప్రమాదముల పట్ల అవగాహన



**పులివెందుల సూర్య వాస్తవం:** ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారులు పేర్కొన్నారు ఈ కార్యక్రమాల్లో భాగంగా శనివారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పులివెందుల పట్టణ శివారులోని ఆదిత్య బిర్లా



గార్మెంట్స్ యందు పనిచేస్తున్న సిబ్బందికి సెక్యూరిటీ సిబ్బందికి మహిళలకు అగ్ని ప్రమాదముల పట్ల అవగాహన కల్పించడం అయినది .పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అక్కడ నుండి సురక్షితంగా ఎలా బయటపడాలో డెమో ద్వారా వివరించడం అయినది. అలాగే గ్యాస్ ఫైర్స్ , ఎలక్ట్రికల్ ఫైర్స్ గురించి వివరించడమైనది .అలాగే పొగ నిండి ఉన్న గదిలో నుండి బయటికి సురక్షితంగా ఎలా రావాలో డెమో ద్వారా చూపించడం అయినది .ఫైర్ ఎక్స్టింగ్ విషర్ గురించి వివరించి అవి ఏ ఏ సందర్భంలో వాడాలో వివరించి ఒక చిన్న ట్రేలో బట్ట ముక్కలు పెట్టి నిప్పు అంటించి ఫైర్ ఎక్స్టింగ్ విసర్ ను ఉపయోగించి అక్కడ ఉన్న మహిళల చేత డెమో ద్వారా చూపించడమైనది .ఈ కార్యక్రమంలో కడప జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి యు. శరత్ బాబు మరియు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి సునీల్ కుమార్ గారు ఇతర అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీరు జీవం- ప్రతిబొట్టు అమూల్యం

## ఎంపీడీవో కొల్లాయమ్మ




**వేంపల్లె - సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారముగా స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జల హారతి- జల సంరక్షణ మీద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడ మైనదని ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్.ఈ. సుధాకర్ తెలియజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసినఎంపీడీవో కుళ్లాయమ్మ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నీటి కొరత ప్రధాన సమస్యగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి విలువను గ్రహించి, దానిని సమర్థవంతంగా వినియోగించుట అత్యవసరమని, ఈ విషయం పట్ల అవగాహన కలిగి, మిగిలిన వారికి అవగాహన కలిగించాలని తెలియజేశారు .గౌరవ అతిథిగా విచ్చేసిన ఈ ఓ ఏ.నాగభూషం రెడ్డి మాట్లాడుతూ సమాజంలో నీటి ప్రాముఖ్యతను తెలియజేయుటకు జల సంరక్షణ పై అవగాహన పెంపొందించుట లక్ష్యముగా జల హారతి కార్యక్రమం ఏర్పాటు చేసి, సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని, విభిన్న ఉదాహరణల ద్వారా వివరించారు. ఎస్ ఏ - ఎస్ ఏ కోఆర్డినేటర్ డాక్టర్. ఎం. ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఎదురయ్యే ప్రధాన సమస్యలలో ముఖ్యమైనది నీరు. కావున నీటిపై అవగాహన కలిగి మనము, మనతో పాటు భావితరాలను జాగృతం చేయవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నదని తెలియజేశారు. అధ్యాపక బృందం, పంచాయతీ సిబ్బంది ,విద్యార్థినీ విద్యార్థులు జల సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు .జాతీయ గీతంతో కార్యక్రమం ముగించబడినది.

## 52చట్టాలపై అవగాహన కలిగి ఉండండి

### ఎస్.వి డిఫెన్స్ అకాడమీ, గురుకుల విద్యార్థులకు

### మహిళ పీఎస్ డిఎస్పి శ్రీలత పిలుపు



**తిరుపతి - సూర్య వాస్తవం:** నేడు సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలకు గంజాయి డ్రగ్స్ దుర్వేసనాలకు దూరంగా మెలగాలని చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి శ్రీలత పిలుపునిచ్చారు.- తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతి ఎస్వీ డిఫెన్స్ అకాడమీ కామ గురుకుల పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత, సీఐ తమీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ మోసాలు, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో పెరుగుతున్న సైబర్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, మహిళలు,బాలల భద్రత, విద్యార్థులు ఎదుర్కొనే వివిధ సమస్యలపై అవగాహనతో మెలగాలని సూచించారు.విద్యార్థులు అపరిచితులపై విశ్వాసం ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలి, అనుమానాస్పద కాల్స్, మెసేజులు, లింకులను స్పందించకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని, చట్టపరమైన సహాయం పొందడానికి ముందుకు రావాలని ప్రోత్సహించారు.-ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని, తమ సందేహాలను వ్యక్తపరచగా, అధికారులు సమగ్రంగా సమాధానాలు అందించారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో విద్యపై దృష్టి సారించాలని ఆ సాంఘిక కార్యక్రమాలకు దూరంగా మెలగాలని కోరారు.